క్లుప్తంగా

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని 24 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల అమరవీరుల స్థూపం



స్థూపానికి పేరు మార్చిన జేఏసీ నాయకులు

జగిత్యాల: తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మ బలిదానాలు చేసి ప్రాణత్యాగం చేసిన అమరులంతా బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలని జేఏసీ నాయకులు అన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత అగ్రవర్ణాలకు వెళ్లిపోయిందని పేర్కొన్నారు. అందుకని అమరవీరుల స్థూపానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ అమరవీరుల స్థూపాలని పెయింటింగ్ రాస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శివ మహరాజ్, కోటేశ్, వెంకటేశ్, మనోజ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న సభ్యులు

జగిత్యాల: క్రీడాకారులు జాతీయస్థాయిలో సైతం రాణించాలని రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నెల రోజులుగా స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో సమ్మర్ కోచింగ్‌లో భాగంగా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ జరుగుతుంది. ఈ శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వీరంతా జాతీయస్థాయిలో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ విశ్వప్రసాద్, నిరంజన్, రవికుమార్ పాల్గొన్నారు.


మహిళలు అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలవాలి



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న శంకరయ్య

మల్లాపూర్: మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచి ఆర్థికాభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శంకరయ్య అన్నారు. బుధవారం మల్లాపూర్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో అత్యుత్తమంగా రాణిస్తున్నారని కొనియాడారు. మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ స్రవంతి, యూనియన్ బ్యాంక్ స్పెషల్ ఆఫీసర్ జాకీర్‌హుస్సేన్, క్యాంటీన్ నిర్వాహకులు దురిశెట్టి భారతి, మహిళలు పాల్గొన్నారు.

సైనికుడికి సన్మానం



సైనికుడిని సన్మానిస్తున్న మిత్రబృందం

ధర్మపురి: ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పంజాబ్ సరిహద్దుల్లో విధులు నిర్వహించి ఇటీవల ధర్మపురికి వచ్చిన సైనికుడు అజ్మత్‌కు బుధవారం సాయంత్రం 1998–99 ఎస్ఎస్‌సీ మిత్రబృందం ఘనంగా సన్మానించారు.



తిప్పన్నపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాంమోహన్



కొత్తదాంరాజుపల్లిలో దరఖాస్తులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూభారతితో భూ సమస్యల పరిష్కారం

జగిత్యాలరూరల్/రాయికల్/మల్యాల/మల్లాపూర్/ కథలాపూర్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/మల్లాపూర్/మేడిపల్లి: భూ భారతితో భూసమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్లు అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. భూ సమస్యలతో బాధపడుతున్న రైతులంతా దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి భూవివాదాలను పొందుపర్చుతామని తెలిపారు. రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమాల్లో రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



అమ్మక్కపేటలో దరఖాస్తుల స్వీకరణ

సన్నరకం వరికి రూ. 500 బోనస్ ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: సన్నరకం వరి ధాన్యానికి బోనస్ రూ.500 ఇవ్వాలని కథలాపూర్‌లో బీజేపీ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రకటించి ఇప్పటికీ రైతులకు ఇవ్వలేదన్నారు. రైతు బంధు పథకం డబ్బులు రైతులకు ఇప్పటివరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, ఆనంద్‌రెడ్డి, కథలాపూర్ మహేశ్, జీవన్‌రెడ్డి, ప్రతాప్, రాజేశ్, శాంతారాం, గంగమల్లయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

మేడిపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని, అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని బీజేపీ మేడిపల్లి,భీమారం మండలాల అధ్యక్షులు చిట్యాల సురేష్, నాగం శివకుమార్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోపించారు. ప్రభుత్వం రైతులకు వెంటనే డబ్బులు చెల్లించి పెట్టుబడికి సాయం అందించాలని కోరారు. రుణమాఫీ వెంటనే చేయాలని, ప్రతి క్వింటాలుకి రూ. 500 వందల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మామిడి ధర్మారెడ్డి, బత్తుల రమేష్, యువమోర్చ మండల అధ్యక్షులు గోస్కి మధు, తదితరులు పాల్గొన్నారు .

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

పెగడపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని రాష్ట్ర ఎస్టీటీయూ తెలంగాణ అధ్యక్షుడు కర్వేద మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెగడపల్లి, నందగిరి, మ్యాక వెంకయ్యపల్లి, నంచర్ల, రాములపల్లి గ్రామాల్లో బుధవారం బడిబాట నిర్వహించారు. ఎంఈవో సులోచన, జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్, మండల నాయకులు వెంకటేశ్, శేఖర్, కిషన్, సత్యం, సుబ్బారావు, శంకర్, జహీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం నిజామాబాద్ నుంచి హన్మకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఇటుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్,సిబ్బందితో ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

కేబుల్, ఇంటర్‌నెట్ ఆపరేటర్లు పోల్ ట్యాక్స్‌ను చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ గంగారాం

మెట్‌పల్లి: పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను వినియోగిస్తున్న కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్ సర్వీసు ఆపరేటర్లు పోల్ ట్యాక్స్‌ను చెల్లించాలని డీఈ గంగారాం సూచించారు. పట్టణంలోని కార్యాలయంలో బుధవారం సిబ్బంది, ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ స్తంభాల వాడకంపై సంయుక్తంగా సర్వే జరిపి గుర్తించాలన్నారు. పట్టణాల్లో ఒక్కో స్తంభానికి రూ.20, గ్రామాల్లో రూ.15 చొప్పున ట్యాక్స్‌ను చెల్లించాలన్నారు. సమావేశంలో ఏడీఏలు మనోహర్, రఘుపతి, ఏఈలు అమరేందర్, రవి, అజయ్, సత్యనారాయణ, శ్యామ్, అర్జున్, అశోక్, భూమేశ్వర్‌లు ఉన్నారు.

క్రీడాకారిణికి అభినందన



ఐశ్వర్యను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి: ఆసియా గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన క్రీడాకారిణి శ్యాంరావు ఐశ్వర్య ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అభినందించారు. ఐశ్వర్య ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన ఆసియా గేమ్స్‌లో పవర్ లిఫ్టింగ్ 52 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం ఆయన కార్యాలయంలో ఆమెను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఆమె మరింతగా క్రీడల్లో రాణించి దేశానికే గర్వకారణంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంగనభట్ల దినేశ్, సింహరాజు ప్రసాద్, వేముల రాజేశ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. వచ్చేది మళ్లీ కేసీఆర్ పాలనే



రైతులతో ముచ్చటిస్తున్న వినోద్‌కుమార్, రవిశంకర్

మల్యాల: అధైర్య పడకండి వచ్చేది కేసీఆర్ పాలనేనని మాజీ రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని రాంపూర్ నుంచి వెళ్తూ రైతులను చూసి, ఆగి, వారితో ముచ్చటించారు. వారితో కలిసి చాయ్ తాగారు. కేసీఆర్ పాలనలోనే రైతులు, వృద్ధులకు న్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతు రుణమాఫీ కూడా పూర్తి చేయలేదని వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆనాటి రోజులే బాగుండే అని గుర్తు చేసుకున్నారు. మళ్లీ కేసీఆర్ పాలన వస్తుందని, మీరంతా అండగా నిలవాలని ముచ్చటించారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేదాకా కొట్లాడుతామని భరోసానిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, క్యాతం భూపతిరెడ్డి, నాయకులు ఉన్నారు.

మాజీ జెడ్పీ వైస్ చైర్మన్‌కు పరామర్శ

మేడిపల్లి: జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు తండ్రి సురేందర్ రావు ఇటీవల మరణించగా, బుధవారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ వారి స్వగృహం భీమారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారివెంట బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సుంకే రవిశంకర్, నాయకులు లోక బాపురెడ్డి, తుల ఉమ, తదితరులు ఉన్నారు.

బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్సీ



బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్సీ వెంకట్ పూజలు

మల్యాల: మండలంలోని మానాలలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో బీరప్ప– కామరాతి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం నాగవెల్లి నిర్వహించారు. ఆలయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ఎమ్మెల్సీ తన సొంత ఖర్చులతో రూ.2.19 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి, శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని సన్మానించారు. కార్యక్రమంలో బల్మూరి వంశీధర్‌రావు, పాపారావు, ఎడిపెల్లి రాజన్న, ఎడిపెల్లి తిరుపతి, చెట్టి తిరుపతి, పెద్ది నర్సయ్య, చెవిటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో సొంత పార్టీ వాళ్లకే ఇళ్లు



ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్న నర్సింగరావు

కోరుట్ల: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోరుట్ల పట్టణంలో కేవలం 80 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నామమాత్రంగా ఇచ్చారని, అది కూడా సొంత పార్టీ కార్యకర్తలకే వచ్చాయని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల పార్టీ అని, ప్రతీ నిరుపేద సొంతింటి కళ నిజం చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, 33 వార్డుల ఇందిరమ్మ కమిటీల సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు

మెట్‌పల్లి: అర్హులైన పేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు స్పష్టం చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ ఆజాద్, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి వెలిసిందని పూజలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో రామాలయం సమీపంలో పెద్దమ్మతల్లి విగ్రహం బయటపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి విగ్రహం బయట పడడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్ల ధర్మారం గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. బుధవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జక్కినపల్లి భూమారావు, మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్ ఉన్నారు.



తల్లిప్రేమ..

జగిత్యాల: పట్టణంలోని గోవిందుపల్లికి చెందిన నరేందర్ అనే వ్యక్తికి చెందిన ఆవు ఈ మధ్యనే లేగ దూడకు జన్మనిచ్చింది. మంగళవారం రాత్రి ఆవు మేతకు కోసం వెళ్లి ఇంటికి రాలేదు. లేగ దూడకు పాల కోసం తల్లడిల్లడంతో యజమాని నరేందర్ ఒక ఆటోలో లేగ దూడను తీసుకుని పట్టణంలో తిరుగగా, జగిత్యాల కొత్త బస్టాండ్ సమీపంలో ఆవును గుర్తించాడు. ఆటోలో తన లేగదూడను చూసిన ఆవు ఆటో వెంట పరుగులు తీసింది. ఇంటికి వచ్చేవరకు ఆటో వెంట పరుగులు తీయగా ఆ దృశ్యాలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కన్నబిడ్డలకు తల్లికి ఎంత ప్రేమ ఉంటుందో ఈ దృశ్యం చూస్తే తెలుస్తోంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చదువు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యారులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 20 ఏళ్ల తరువాత అందరు ఒకేచోట కలుసుకోవడంతో తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కాగా తమ బ్యాచ్‌కు చెందిన స్వర్గం గీత తన భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మహిళకు రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు.



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అస్తవ్యస్తంగా పారిశుధ్యంపై ఫొటో స్టోరీ ప్రచురితం కావడంతో ఆర్టీసీ అధికారులు స్పందించారు. డిపో మేనేజర్ కల్పన వెంటనే పారిశుధ్యం మెరుగుపర్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్



ఎమ్మెల్యే వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురి: రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్లలో ఓ కార్యకర్త ఇంటిలో జరిగిన శుభకార్యానికి విచ్చేసిన ఆయన అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు,అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అసత్యాలు, ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు జాజాల రమేష్,గణేష్, సత్యం, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం/మల్లాపూర్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై కిరణ్ మల్లాపూర్ ఏఎస్సై లచ్చయ్య అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ఆటో డ్రైవర్లు, స్థానికులకు ఎస్సై కిరణ్, మల్లాపూర్ భరతమాత కూడలి వద్ద ఏఎస్సై లచ్చయ్య ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చాలా మంది సైబర్ నేరగాళ్లు బ్యాంకు అధికారులమంటూ ఫోన్లు చేసి తమ ఖాతా వివరాలు అడిగితే ఎవ్వరు చెప్పవద్దన్నారు. అలాగే, సెల్‌ఫోన్‌లో వచ్చె అనవసరపు లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు.యువత, విద్యార్థులే లక్ష్యంగా దుండగులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేష్, సిబ్బంది, మల్లాపూర్‌లో పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ లింగమూర్తి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగార్జున

రాయికల్: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగార్జునను నియమిస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న తహసీల్దార్ ఖయ్యూం హజ్ యాత్రకు వెళ్లగా, డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన గణేశ్‌ను ఇన్‌చార్జీ తహసీల్దార్‌గా నియమించగా, లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దీంతో ధర్మపురి తహసీల్దార్ నాగార్జునను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ గండి పూడ్చివేత

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో ఒర్రె వద్ద రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు పడిన గండిని బుధవారం మట్టిపోసి పూడ్చివేశారు. ఒర్రె వద్ద ప్రతీ ఏడాది కాలువకు గండి పడటంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మట్టిని ఎత్తుగా పోసి ట్రాక్టర్‌తో చదును చేయించారు. కాలువనీటితోపాటు వర్షపునీరు ఉధృతంగా పారిన కాలువకు నష్టం జరగకుండా మరమ్మతులు చేయించినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

విత్తనోత్పత్తితో అధిక ఆదాయం

సారంగాపూర్: రైతులు తమ పంట పొలాల్లోనే నాణ్యమైన విత్తనాలు వాడి విత్తనోత్పత్తి చేస్తే రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందని పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మజ, డాక్టర్ పి. మధుకర్‌లు అన్నారు. బుధవారం మండలంలోని నాయికపుగూడెం గ్రామంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. ప్రతీ ఏడాది కొత్తగా విత్తనాలు కొనడం ద్వారా పెట్టుబడి పెరుగుతుందని, తమ పొలాల్లోనే నాణ్యమైన విత్తనాలు సేకరించి, వచ్చే పంటకు వాడుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులు శాస్త్రవేత్తలు రూపొందించిన నాణ్యమైన విత్తనాలు నాటి, వాటిని తిరిగి రైతులకు అమ్మితే ఆదాయం పెరుగుతుందని తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ సాగును విస్తరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఆరు నెలల జైలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అక్కనపల్లి జలేశ్‌కు ఆరు నెలల జైలుశిక్ష, రూ.2.50లక్షల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి మున్సిఫ్ మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ తీర్పునిచ్చారు. బాధితుడు గట్టు శ్రీనివాస్ కథనం ప్రకారం.. కొమటి కొండాపూర్ గ్రామానికి చెందిన గట్టు శ్రీనివాస్ 1.70 లక్షలు మాజీ సర్పంచ్ జలేష్‌కు అప్పుగా ఇచ్చాడు. తీసుకున్న అప్పు తీర్చేందుకు గట్టు శ్రీనివాస్‌కు 1.70 లక్షల చెక్కును 1 డిసెంబర్ 2019 ఎస్‌బీఐ బ్యాంక్ పేరున ఇవ్వగా చెక్కును బ్యాంక్‌లో జమ చేయడంతో చెక్కు బౌన్సు కావడంతో ఫిబ్రవరి 6 2020 న చెల్లని చెక్కు ఇచ్చినందుకు గట్టు శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చెల్లని చెక్కు ఇచ్చినందుకు మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ జలేశ్‌కు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన బద్దినపల్లి గంగరాజం(56) అనే వ్యక్తి ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందినట్లు ఎస్సై సుధీర్ రావు బుధవారం తెలిపారు. రాజిరెడ్డికి చెందిన ట్రాక్టర్లో బియ్యం పట్టించుకోవడం కోసం కుమ్మరిపెల్లి లోని రైస్ మిల్ కి వెళ్లగా ట్రాక్టర్ లో ఉన్న ధాన్యాన్ని దింపుతుండగా ట్రాక్టర్ వెనుక ఉన్న గంగరాజంను గుర్తించకపోవడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వెనుక భాగం గంగారాజం తలకు తీవ్రంగా తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్ లో జగిత్యాల కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు సంజీవ్ ఫిర్యాదు మేరకు రాజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.